క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



కర్లపాలెం: అగ్ని ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ మండలాధ్యక్షుడు ఇనకొల్లు పోలీస్‌రావు అన్నారు. ఇటీవల యాజలి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమై నిరాశ్రయులైన ఇక్కుర్తి శ్రీనివాసరావు కుటుంబానికి ఆదివారం రెడ్‌క్రాస్ తరఫున తాత్కాలిక గుడారం ఏర్పాటుకు పరదా పట్టలు, వంట పాత్రలు, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామదేవత ఉర్లమ్మకు పూజలు



కర్లపాలెం: గ్రామదేవత ఉర్లమ్మ వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే కోన రఘుపతి ఆకాంక్షించారు. మాజీ ఎంపీపీ మాడా వెంకటరత్నం కుమారుడు నల్లమోతు వారిపాలెం గ్రామ సర్పంచ్ మాడా సుబ్రమణ్యం సోదరులు ఆదివారం గణపవరం గ్రామదేవత ఉర్లమ్మ వారికి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కుబడి కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని, అమ్మవారి శిల వద్ద టెంకాయలు కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం సోదరులు భక్తులకు అన్నదానం చేశారు. పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎంపీ ఆర్థిక సాయం



రేపల్లె రూరల్: మండలంలోని పోటుమెరక గ్రామానికి చెందిన రేపల్లె గోపాలకృష్ణ పూరిల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోయింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చేయూతనిచ్చారు. రూ.20వేల ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర వస్తువులను గ్రామ పెద్దల ద్వారా ఆదివారం అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాగితాల హనమ ప్రసాద్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ



ఐలవరం(భట్టిప్రోలు): పద్మశాలీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్-విజయవాడ (పీవా) ఆధ్వర్యంలో శ్రీ వెంకట దుర్గా శారీ మందిర్ అధినేత (కాకినాడ) వింజమూరి భాస్కరరావు సౌజన్యంతో ఆదివారం ఐలవరంలో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఐలవరం-కనగాల పీవా బ్రాంచ్ ఆర్గనైజర్ కాగితపు యానాదిరావు స్వగృహంలో ఇంటర్, ఆపై తరగతులు చదువుతున్న ఆయా గ్రామాలకు చెందిన 20 మంది విద్యార్థులకు రూ. 20 వేలు స్కాలర్ షిప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కటకం సాంబశివరావు, మాజీ ఎంపీపీ అందె వెంకటేశ్వర్లు, పీవా ప్రధాన కార్యాలయ ప్రతినిధి చిలుకోటి శ్రీమన్నారాయణ, సభ్యులు దీపాల సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు స్థల పరిశీలన

భట్టిప్రోలు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాల్లో మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బీఎఫ్‌ఏనిర్వాహకులు వంగర ప్రసాద్ ఆదివారం భట్టిప్రోలు విచ్చేసి మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. భట్టిప్రోలు గ్రామాన్ని పచ్చదనం దిశగా ఉంచేందుకు కృషి చేస్తున్నట్లు ప్రసాద్ తెలిపారు. కాలుష్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు మొక్కలు నాటుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు, బీఎఫ్ఏ ఎగ్జిక్యూటివ్ సభ్యులు పసుపులేటి శివ రామప్రసాద్, వంగర బాబూజి తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- దుండిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ లబ్ధిని వివరించి, కరపత్రాన్ని స్థానిక నాయకుల ద్వారా అందజేస్తున్న మంత్రి మేరుగ

దుండి పాలెం(వేమూరు): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలంలోని దుండిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి ప్రజలకు సూచించారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తెలంగాణ, రాజస్థాన్ ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చందోలు డేవిడ్ విజయకుమార్, గ్రామ సర్పంచ్ కంచల భగవద్గీత, ఎంపీపీ జాలాది రూబేను, పార్టీ మండలాధ్యక్షుడు అన్నపరెడ్డి రాఘురామిరెడ్డి, మాజీ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, మాజీ జెడ్పీటీసీ గాదె శివరామ కృష్ణారెడ్డి, కుంచల వెంకటరెడ్డి తమా శ్రీనివాసరెడ్డి, సాంబరెడ్డి, సామ్రాజ్యం, డాన్ బాస్కో, కొండముంది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతకు నా మట్టి- నా దేశం దోహదం

సేకరించిన మట్టితో ఢిల్లీ వెళ్లిన బీజేపీ నేతలు



ఢిల్లీ వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు చేరుకున్న బీజేపీ జిల్లా నేతలు

గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నా మట్టి- నా దేశం కార్యక్రమంలో భాగంగా ఈనెల 31న ఢిల్లీలో జరిగే అమృతత్ కలశ యాత్రకు జిల్లా నుంచి బీజేపీ నాయకులు ఆదివారం విజయవాడ నుంచి ప్రత్యేక రైలులో ఆదివారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. జిల్లాలోని 37 మండలాల్లో ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించి పవిత్ర కలశాలలో నింపి ఢిల్లీలోని అమృత వనానికి కలశాలను చేర్చేందుకు 65 మంది గుంటూరు నుంచి బయలుదేరినట్లు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర తెలిపారు. కార్యక్రమంలో నేతలు ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, రాచమల్లు భాస్కర్, వెలగలేటి గంగాధర్, ఈమని మాధవరెడ్డి సరోజిని, స్వాతి, లక్ష్మి పాల్గొన్నారు.

న్యూజిలాండ్‌లో ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు



న్యూజిలాండ్‌లో స్థానిక ఎంపీలతో శాంతమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ వేడుకల్లో గుంటూరులోని అమరావతిరోడ్డుకు చెందిన అవర్ స్టేట్ అవర్ లీడర్, వైఎస్సార్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం సంస్థల వ్యవస్థాపకుడు జి. శాంతమూర్తి పాల్గొన్నారు. న్యూజిలాండ్‌లోని మన ఆంధ్ర తెలుగు అసోసియేషన్ (మాటా) ఆధ్వర్యంలో తెలుగు ప్రజలు జరుపుకున్న వేడుకలకు స్థానిక ఎంపీలు గ్లాసెన్ మెలీసా లీ అన్నా, హెలీవైట్ హాజరయ్యారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్న వేడుకల్లో రాష్ట్రావతరణకు మూల కారకుడైన పొట్టి శ్రీరాములు త్యాగం, ఆయన చేసిన ఆమరణ నిరాహార దీక్ష గురించి స్మరించుకున్నట్లు శాంతమూర్తి తెలిపారు. వేడుకల్లో వెయ్యి మందికి పైగా పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

గోశాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయండి

- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు
- వెంగళాయపాలెంలో షెడ్డుల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న నగర మేయర్ కావటి, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బందెల దొడ్డి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. గోవుల పరిరక్షణలో భాగంగా ఆదివారం వెంగళాయపాలెంలో గో సేవ రక్షకులతో కలసి మేయర్ షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో వీధుల వెంట తిరిగే ఆవులు అధికంగా ఉన్నాయని, వాటి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పలు ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయని చెప్పారు. ఆవుల్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వాటి కోసం ప్రత్యేకంగా నగరంలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వెంగళాయపాలెంలో రూ. 50 లక్షలతో షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. రోడ్లపై తిరిగే ఆవుల్ని షెడ్డుకు తరలించి వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గుంటూరు ప్రొటెక్టింగ్ బర్డ్స్ అండ్ యానిమల్స్ అసోసియేషన్ సభ్యులు ఆవుల సంరక్షణకు సహాయ, సహకారాలు అందించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. షెడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), కార్పొరేటర్లు చల్లా రాజ్యలక్ష్మి, ఈచంపాటి వెంకటకృష్ణ, సాదు ఉమామహేశ్వరి, గుంటూరు ప్రొటెక్టింగ్ బర్డ్స్ అండ్ యానిమల్స్ అసోసియేషన్ సభ్యులు ప్రదీప్ జైన్, నిఖిల్ జైన్, సురేష్ జైన్, రామకృష్ణ, దర్శన్, యశ్వంత్, మహావీర్, అశోక్, భరత్, అనిల్, రాజు, ఈఈ కొండారెడ్డి, డీఈఈ కల్యాణరావు, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం



శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్యాడెట్స్‌తో ఎన్‌సీసీ అధికారులు

గుంటూరు రూరల్: చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో పది రోజులుగా నిర్వహిస్తున్న 10 ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ ఏటీసీ ఐదో శిబిరం ఆదివారంతో ముగిసింది. శిక్షణలో 706 మంది విద్యార్థినులకు ఫైరింగ్, డ్రిల్, టగ్ ఆఫ్ వార్, వాలీబాల్, అథ్లెటిక్స్, రన్నింగ్, క్రీడా సాంస్కృతిక విభాగాల్లో శిక్షణ అందజేశారు. దేశ రక్షణపై అవగాహన, దేశభక్తి, జాతీయ గీతం ఆవశ్యకతను తెలియజేశారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థినులకు మెడల్స్, ప్రోత్సాహక నగదు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే అవకాశం లభించిందని కల్నల్ నీరజ్‌కుమార్ పేర్కొన్నారు. సామాజిక సేవలో, దేశ రక్షణలో వారి కర్తవ్యాన్ని నిర్వర్తించే విధంగా బాలికలు ఉత్సాహంగా శిక్షణ పొందారని ఆయన తెలిపారు. కార్యక్రమాలు విజయవంతంగా జరుపుకోవడానికి పూర్తి సహాయ సహకారాలు అందజేసిన ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యానికి ఎన్‌సీసీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. దేశభక్తి, సామాజిక సేవ కలిగిన పౌరులుగా బాలికల్ని తీర్చిదిద్దేందుకు తమ కళాశాల వేదిక కావడం గర్వకారణమని అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సమాజ సేవలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలకు కళాశాల తరఫున సహాయ, సహకారాలు అందించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి. శ్రీనివాస్, డెప్యూటీ క్యాంపు కమాండెంట్ కల్నల్ రెజిత్ ముకుందన్, క్యాంపు ఎస్.ఎం సుబేదార్ పాణ్యం రఫీ, జీసీఐ జెస్సీ జొరాల్డ్, 10 ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ సూపరింటెండెంట్ రాజశేఖర్‌బాబు, క్యాంపు ట్రైనింగ్ జేసీవో నాయబ్ సుబేదార్ షేక్ ఖాజావలి, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ తారాచంద్, డాక్టర్ ఉషాక్రాంతి పాల్గొన్నారు.

జాతీయ క్విజ్ పోటీలకు నారాకోడూరు విద్యార్థి ఎంపిక

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి ఆదిత్యవర్ధన్ ఆన్‌లైన్‌లో జరిగిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ ఎడ్యుకేషన్ టీసీఎస్ నేషనల్ లెవెల్ రూరల్ ఐటీ క్విజ్‌లో ఆదిత్యవర్ధన్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలో ప్రతిభ కనబరచడంతో నవంబర్ ఒకటో తేదీన ఆన్‌లైన్‌లో జరిగే జాతీయ స్థాయి ఐటీ క్విజ్‌కు ఆంధ్రప్రదేశ్ తరఫున ఎన్నికైనట్లు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి ప్రకటించినట్లు హెచ్‌ఎం ఎం. ఏడుకొండలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య వర్ధన్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించినట్లు ఆయన పేర్కొన్నారు.

డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి



రేపల్లె రూరల్: కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆదివారం మధ్యాహ్నం రేపల్లె డిపో జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎన్‌వీ సాగర్ మాట్లాడుతూ విధుల నిర్వహణలో ఉన్న డ్రైవర్‌పై దాడికి పాల్పడటం అమానుషమన్నారు. ప్రభుత్వం ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంయూ నాయకులు జీఎస్ ప్రసాద్, వైఎస్సార్ యూనియన్ నాయకుడు నారాయణ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



చెరుకుపల్లి: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాకినాడ పీవ ఫౌండేషన్ దోనర్ వింజమూరి భాస్కరరావు అన్నారు. చెరుకుపల్లి, రాజవోలు గ్రామాల్లో పేద పద్మశాలి మెరిట్ విద్యార్థులకు విజయవాడ పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ సహకారంతో 40 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ 1000 చొప్పున స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా పీవ ఫౌండర్ దివి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ స్కాలర్ షిప్ అందుకున్న విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని సేవా దృక్పథాన్ని అలవర్చుకుని విద్యలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి, రాజవోలు బ్రాంచ్ పీవ అధ్యక్షులు అక్కల బాలాజీ, పడవల మల్లికార్జునరావు, చేనేత నాయకులు భట్టు సుబ్బారావు, బిట్రా మోహన్ రావు, కటకం సాంబశివరావు, ఆకురాతి కోటేశ్వరరావు, చింతక్రింద శ్రీరాంమూర్తి పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్టు

కొల్లూరు: పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. 11 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. కిష్కిందపాలెంలోని రక్షిత మంచినీటి పథకం సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో కొల్లూరు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 15,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, తెనాలి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జంపని షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిలు విడుదల

జంపని(వేమూరు): జంపని షుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగాలు చేసిన కార్మికులకు ఈ నెల 2న బకాయిల నగదు చెక్కులు పంపిణీ చేయడం జరుగుతుందని ఫ్యాక్టరీ లిక్విడేటర్ ఎస్‌ఎన్‌పీ చంద్రకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెక్కులను కార్మికులకు అందజేస్తారని పేర్కొన్నారు.

మట్టి ఖర్చులు అందజేత



పేరలి(కర్లపాలెం): పేరలి పంచాయతీ బక్కావారిపాలేనికి చెందిన ఎం.సంగీతరావు(70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు మట్టి ఖర్చులకు గాను పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, ప్రముఖ నేత్ర వైద్యుడు పేరలి బాలకృష్ణమూర్తి ఆర్థిక సహకారంతో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాగిత బుల్లియ్య, ట్రస్ట్ కార్యదర్శి శ్రీనివాసరావులు సంగీతరావు కుటుంబ సభ్యులకు రూ.5వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొర్రుముచ్చు మీరయ్య, మద్దిబోయిన శివరావు, గేరా ఏసుబాబు, షేక్ సుభానీ, మల్లెల పొలు, నాదెండ్ల బాబూరావు, కర్రి ముక్కంటి, కాటూరి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై ప్రజలను చైతన్య పరచాలి

నేటి నుంచి తీరప్రాంతంలో అవగాహన సదస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు మల్లికార్జునరావు

రేపల్లె: ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తీర ప్రాంత ప్రజలను చైతన్య పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తహసీల్దారు డి.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేపల్లె మండలంతో పాటు భట్టిప్రోలు, కొల్లూరు మండలాలు తీరప్రాంతమైన కృష్ణానది ఒడ్డున ఉండటం, నిజాంపట్నం మండలం సముద్రానికి సమీపంలో ఉండటంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించేందుకు అవకాశం ఉంటుందన్నారు. నాలుగు రోజుల పాటు తీరప్రాంత గ్రామాలలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు రెస్క్యూ బృందం విపత్తులు సంభవించిన సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్య వంతుల్ని చేస్తారని తెలిపారు. 30న పెనుమూడి పల్లెపాలెంలో, 31న పట్టణంలోని మున్సిపల్ హైస్కూలులో, నవంబర్ 1న భట్టిప్రోలు మండలం పెసర్లంకలో, 2న కొల్లూరు మండలంలో, 3న నిజాంపట్నం మండలంలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, భట్టిప్రోలు తహసీల్దారు వెంకటేశ్వరరావు, ఎంఈవో కేసనశెట్టి సురేష్, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, అగ్నిమాపక అధికారి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన సూరేపల్లి విద్యార్థినులు



విద్యార్థినులతో హెచ్‌ఎం, పీఈటీ తదితరులు

భట్టిప్రోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో చుండూరు మండలం యడ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం జరిగిన వేమూరు నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్‌లో సూరేపల్లి వీపీ అండ్ జీఎస్‌ఎం హైస్కూల్ విద్యార్థినులు సత్తా చాటారు. అండర్-17 విభాగంలో నితీష, ధన అక్షయ, మధు నాగ శ్రీవల్లి, బొర్రా కీర్తికాశ్రీ (9వ తరగతి), సీహెచ్ మాధవి (10వ తరగతి), అండర్-14 విభాగంలో ఎం. అక్షర (7వ తరగతి), ప్రణతి, ఆమని(8వ తరగతి)లు ప్రతిభ చాటారు. వీరు ఈ నెల 30న గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాస శర్మ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినులు, పీఈటీ జీవీఎస్ నాగేశ్వరరావును హైస్కూల్ పాలక వర్గ అధ్యక్షుడు వేపూరి చలమయ్య, కరస్పాండెంట్ ఆర్.వెంకట కృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్సాహంగా ఫిట్ ఇండియా రన్



విజేతలతో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు

చెరుకుపల్లి: చిన్నతనం నుంచే వ్యాయామం అలవాటు చేసుకుని, దేహ దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పైనం ఏడుకొండలురెడ్డి అన్నారు. ఫిట్ ఇండియా స్వచ్ఛత రన్ 4.0 కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో ఆదివారం స్కూల్ నుంచి చిన్నారులకు, పెద్దలకు 5, 3, 2 కిలోమీటర్ల పరుగు పందెం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు 500 మందికి పైగా పాల్గొన్నారు. 2కే రన్‌లో మొదటి స్థానం డి.వాసంతి, ద్వితీయ స్థానం వై.రాఘవసాయి కుమార్, 3కే రన్ బాలికల విభాగంలో మొదటి స్థానం పి.నాగస్వాతి, ద్వితీయ స్థానం పి.హేమ చందన, 3కే రన్ బాలురు విభాగంలో డి.శివగణేష్‌రెడ్డి, ద్వితీయ కె.వెంకటేశ్వర్లు, 5కే రన్ బాలికల విభాగంలో ప్రథమ స్థానం పి.నాగ తేజశ్విని, ద్వితీయ స్థానం ఒ.జోత్స్న శ్రీ, 5కే రన్‌లో బాలురు విభాగంలో కె.వెంకట శివారెడ్డి, ద్వితీయ స్థానం ధనుష్‌రెడ్డి సాధించారు. విజేతలకు స్కూల్ యాజమాన్యం బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేసింది. ఈ కార్యక్రమంలో స్కూల్ సీఈవో పైనం గణేష్ రెడ్డి, ప్రిన్సిపల్ నర్గీస్ క్వాజీ, పైనం సాయి రంగారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణమాచార్య శత జయంత్యుత్సవాలు ప్రారంభం



కచేరి చేస్తున్న కౌశిక్ కల్యాణ్ బృందం

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘ, కళా వేదికపై ఆదివారం కృష్ణమాచార్య కళా పీఠం కార్యదర్శి బుచ్చయాచార్యుల ఆధ్వర్యంలో సంగీత, సాహితీ శిరోమణి ఎస్.సి.హెచ్.కృష్ణమాచార్యులు శత జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హిందూ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు డాక్టర్ డీ.వి. దీక్షితులు పాల్గొన్నారు. కార్యక్రమాల్ని బండ్లమూడి హనుమాయమ్మ, డాక్టర్ వి.ఎస్.డి. శ్యామ సుందరీదేవి జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. డాక్టర్ దీక్షితులు మాట్లాడుతూ ఉత్తమ పురస్కార గ్రహీత ఎస్.సి.హెచ్.కృష్ణమాచార్యులు ఆకాశవాణి విజయవాడ కేంద్రానికే వన్నెతెచ్చిన సంగీత, సాహితీ శిరోమణిగా పేర్కొన్నారు. అనంతరం బృందగానంలో అన్నమాచార్య, తీరు వెంకటాచార్యులు, కృష్ణమాచార్యులు కీర్తనలను రసరమ్యంగా శాంతిశ్రీ, తుషార పుర్ణవల్లి, లక్ష్మీశ్రీహరి, సూర్యలక్ష్మి గానం చేశారు. వీరికి వయోలిన్‌పై సుబ్రహ్మణ్యరాజు, మృదంగంపై సూర్య సహకారాన్ని అందించారు. అనంతరం హైద్రాబాద్‌కు చెందిన ఏ గ్రేడ్ ఆర్టిస్ట్ కౌశిక్ కల్యాణ్ గాత్ర సంగీత కచేరి అలరించింది. వయోలిన్‌పై దినకర్, మదంగంపై సురేష్‌బాబు, ఘటంపై హరిబాబు సహకారం అందించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి దారుణం

పాత గుంటూరు: కావలిలో డ్యూటీలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు కోరారు. గుంటూరు- 1 డిపో ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నేతలు సంఘటనను ఖండించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వి. కృష్ణారావు మాట్లాడుతూ కష్టపడి ఉద్యోగం చేస్తున్న వారిపై దాడులు చేయడం దారుణమని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా సెక్రటరీ రవిశంకర్, ఎస్ఎంయూ గ్యారేజ్ అధ్యక్షుడు సురేష్, వైఎస్సార్ సంఘ కార్యదర్శి కె.ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా ఓబీసీ కుల గణన చేపట్టాలి

నెహ్రూనగర్: ఏపీలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపడుతున్న విధంగానే దేశవ్యాప్తంగా ఓబీసీ కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. ఓ ప్రైవేటు కార్యక్రమానికి గుంటూరు వచ్చిన సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్. రఘువీరారెడ్డిని బీసీ సంఘ నాయకులు ఆదివారం కలసి వినతి పత్రం అందజేశారు. ప్రతిపక్ష పార్టీగా లోక్‌సభ, రాజ్యసభల్లో కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి 2024లో కులగణన చేపట్టే విధంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశంలో తీర్మానం చేయాలని కోరారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఏపీలో సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కుమ్మర క్రాంతికుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

నేడు పాండురంగ పేటలో సురక్ష వైద్య శిబిరం

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం పాండురంగ పేటలోని షాదీఖానాలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 31వ సచివాలయం పరిధిలోని ప్రజలకు వైద్య సేవలు అందించటం జరుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెడికల్ క్యాంప్ కొనసాగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బాపట్ల డివిజన్
95055 07638 (బాపట్ల)
90102 23706 (వేమూరు, రేపల్లె)
Office mail : sakshigntadvt@gmail.com